

# పున్నాగవాన

రాత్రంతా వర్షం  కురిసింది.

తెలతెలవారుతున్నా ఇంకా సనసన్న జల్లులు పడుతూనే ఉన్నాయి. ఆ చినుకుల్ని, చలిని లెక్కచేయకుండా పది పదిహేనుమంది పిల్లలు బిలబిలమంటూ మొదటి ప్రాకారంలోకి పరుగెత్తుకొచ్చారు.

అక్కడ పెద్ద పున్నాగచెట్టు.

ఆ చెట్టు చుట్టూతా వొత్తుగా పున్నాగపూలు రాలి ఉన్నాయి. కొన్ని లక్షల కోట్ల పున్నాగపూలు నేలంతా పరుచుకుని ఉన్నాయి. ప్రాకారంలో తెల్లటి పట్టు కంబళి పరిచినట్టుంది. పిల్లలు గలగల నవ్వుతూ పున్నాగపూలమీద పరుగెత్తుతూ పువ్వులేరుకుంటూన్నారు. ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ పున్నాగ పూల పరుపుమీద పడిపోతున్నారు. గిలిగింతలు పెట్టుకుంటూ కేరింతలు కొడ్తున్నారు. ఆ పసి పాదాలకింద పున్నాగ పూలు నలిగి పోతున్నాయి. పిల్లలు పూలమీద నడుస్తుంటే పున్నాగ పూల కాడలు 'చిటుక్కు చిటుక్కు'మని చిట్లుతున్నాయి. పూల అడుగున నత్తగుల్లలు పాదాలకింద పడకుండా తప్పుకు పాకిపోతున్నాయి.

ఇంతలో గాలి రయ్యిన వీచింది. చెట్టుపైనించి పున్నాగపూలు జలజల రాలి పడ్డాయి. పూలతెర మీద మరో పూలతెర. ఉహూహూ ..... అని వణుక్కుంటూ పిల్లలు గుత్తులు గుత్తులుగా ఏరుకుంటున్నారు.

ఎన్ని పూలు?

ఎన్నెన్ని పూలు!

చినుకు చినుకుకీ ఓ పూవు పూసినట్టుంది చెట్టు!

కుంటి సింగన్న మెట్లమీద కూర్చుని చూస్తున్నాడు. పున్నాగపూలు గుత్తులు ఒకళ్ళ మీద ఒకళ్ళు చిమ్ముకుంటూ ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తుంటే తనూ వాళ్ళతో కలిసి గెంతుదామనిపిస్తోంది. వాళ్ల గొంతులతో గొంతు కలిపి పాడుదామనిపిస్తోంది. నేలమీద పున్నాగలు, నింగినెంచి రాలుతున్న పున్నాగలు. మధ్యన చిరునవ్వుల చిన్నారులు, సింగన్న నెత్తురు పొంగింది. వాళ్ళతో కలిసి ఆడుకోటానికి తను కుంటి వాడాయె! కళ్ళ నీళ్ళొచ్చాయి.

సింగన్న వయసులో ఉండగా గొప్ప బలశాలి. రాళ్ళెత్తే విద్యలో ఆ పరగణాలో తన్ని కొట్టేవాడు లేడు. పందెం కట్టి మాలక్ష్మమ్మ వారి చెట్టు దగ్గర వూరు వూరంతా చూస్తుండగా పదిమంది పట్టలేని రాయిని తానొక్కడే పైకెత్తి గిర గిర తిప్పి కింద కొదిలేసేవాడు. ఆ కండలు తిరిగిన వొళ్ళు, ఇనపకమ్ముల్లాంటి చేతులు, ఆ బలమైన శరీరం చూసి లచ్చి మనస్సు పులుక్కుమంది. విశాలమైన వీపుమీద చెమటలు అలలు అలలుగా కారుతుంటే పరుగున వెళ్ళి "కొంగుతో తుడుద్దునా!" అని మనసు ఆత్రుత పడేది. తండ్రితో చెప్పింది సింగన్నని తప్ప మరొకరిని మనువాడనని. అన్న ప్రకారం లచ్చి పెళ్ళి సింగన్నతో గుళ్ళో జరిగింది. వూరందరికి ఆ జంటని చూస్తే ముచ్చటేసేది. ఒక్కక్షణం ఒకళ్ళని విడిచి ఒకళ్ళు ఉండేవాళ్ళు కాదు. కృష్ణలో కలిసి జలకాలాడేవారు. సింగన్న కండలు తీరిన శరీరాన్ని లచ్చి గంటలు గంటలు రుద్దేది. సూర్యాస్తమయందాకా స్నానంచేసి గుళ్ళోకొచ్చి సామికి, అమ్మకి మొక్కుకుని ఇళ్ళకెళ్ళేవారు.

పిల్లలు కుప్పలు కుప్పలుగా పున్నాగపూలు బండలమీదికి తీసికెళ్ళి పోస్తున్నారు. కొందరు మాలలల్లుతున్నారు. కొందరు దేవుడికి గజమాల తయారుచేస్తున్నారు. కొందరు పున్నాగపూల రేకులు తుంచి, ఒక్కొక్క రేకును రెండు వేళ్ళ మధ్య కొంచెం నలిపితే రేకుకున్న రెండు పొరలు సళ్ళుకుంటున్నాయి. అప్పుడు అందులోకి గాలి ఊదితే బుడగలా తయారవుతోంది. ఆ బుడగని ఎదటివాళ్ళ నుదుటిమీద కొడ్తే "టప్" మని పేలే ఆట ఆడుకుంటున్నారు. మళ్ళీ పున్నాగచెట్టు దగ్గరకొచ్చి దోసెళ్ళనిండా పూలు తీసుకెళ్ళి బండలమీద పోస్తున్నారు.

సింగన్న నెత్తురు జివ్వుమని లాగుతోంది. వర్షం కురిసిన ఉదయాన ఒక రోజు తనూ, లచ్చి అక్కడ కొచ్చారు. లచ్చి పున్నాగపూలు ఏరుకుంటోంది. తను గబ గబ పున్నాగచెట్టు ఎక్కాడు. లచ్చి నుంచున్న చోట సరిగ్గా పైకొమ్మ మీది కొచ్చాడు. కొమ్మలు ఒక్క పట్టున వూపాడు. గలగల పున్నాగపూలు లచ్చి నెత్తిన రాలాయి - మళ్లీవూపాడు. కుప్పలు కుప్పలుగా గుత్తులు గుత్తులుగా లచ్చి నెత్తిన పున్నాగ వర్షం. అప్సరస నెత్తిన ఆకాశం నుంచి నక్షత్రాలు కురుస్తున్నట్లుంది. ఆ పూలవానలో తడిసిపోతూ, ఆ గాలికి పడే చినుకుల చలికి ముకుళించుకు పోతూ కిల కిల నవ్వింది. గుండె పులక లెత్తేటట్లు నవ్వింది.

పిల్లల గజమాల పూర్తవుతోంది. పూల చెండ్లతో ఆడుకుంటున్నారు. సింగన్న కుంటుకుంటూ పున్నాగ చెట్టు దగ్గర కొచ్చాడు. పిల్లలతో పాటు తనూ "వొప్పులకుప్పా! వయారిభామా!" అని గొణుక్కున్నాడు. తనూ, లచ్చీ అంత సంబరంతో అడుకునేవారు.

ఆ రోజు కునికినపాడు వస్తాదు తనతో పందెం కట్టాడు. చుట్టు పక్కల వూళ్ళనుంచి జనం పందెం చూడ్డానికి వచ్చారు. లచ్చి తప్పకుండా గెలుస్తావని హుషారిచ్చింది. ఇరవైమంది పట్టలేని రాయి పైకెత్తాడు సింగన్న. రొమ్ములదాకా ఎత్తాడు. చేతులపైకి ఎత్తాడు. వందలాది జనం ఆనందంతో చప్పట్లు చరిచి ఈలలు కొట్టారు. ఆ వూపులో ఆ సంబరంలో అవతలికి విసిరేయవలసిన రాయి మీద పడేసుకున్నాడు. జనం గొల్లుమన్నారు. లచ్చి మూర్ఛపోయింది.

సింగన్న బతికాడు కాని పోయింది కాలే!

సింహంలా తిరిగిన సింగన్న పిల్లి అయిపోయాడు. ఈ కళ్ళు ఈ దుఃఖాన్ని చూడలేవు అన్నట్లుగా అది జరిగిన మూణ్ణెళ్ళకే లచ్చి కన్నుమూసింది. సింగన్న కుంటివాడై ఒంటరివాడైనాడు.

పిల్లలు కొప్పులో పున్నాగపూలు తురుముకున్నారు. మెళ్ళలో పున్నాగదండలు వేసుకున్నారు. గుండ్రంగా తిరుగుతూ పాటలు పాడుతున్నారు. ఇంతలో తల్లిదండ్రులు వచ్చి "ఇంక చద్దన్నాలు తినరా? పదండి పదండి" అని కేక లేసేసరికి హో హో అని అరుచుకుంటూ వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయినా సింగన్నకి వాళ్ళపాటలు విన్పిస్తూనే ఉన్నాయి. వాళ్ళ ఆటలు కన్పిస్తూనే ఉన్నాయి. కుంటుకుంటూ చెట్టుకిందకొచ్చి నుంచున్నాడు. అదే చోటు! ఆనాడు లచ్చి నుంచున్న చోటు. లచ్చి తలమీద, వొంటినిండా పున్నాగవర్షం కురిసిన చోటు. సంతోషంగా ఎగిరి గంతెయ్యబోయాడు. కింద పడ్డాడు. దెబ్బతగిలినా బాధనిపించలేదు. పున్నాగపూలు మెత్తగా వొత్తుకున్నాయి. కళ్ళవెంట ధారలుగా కన్నీరు. ఆ పున్నాగ పూలమీద దొర్లాడు. వొళ్ళంతా పున్నాగపూలు పోసుకున్నాడు. ఏడుస్తూ నవ్వుతూ పున్నాగపూలలో పొర్లాడు. శరీరమంతా పున్నాగపూలు, వొంటినిండా పున్నాగ పరాగం.

ఇంతలో గాలి రివ్వున వీచింది. చెట్టుపైనుంచి గుత్తులు గుత్తులుగా పూలు రాలాయి. కొన్నింటిని దోసిట్లో పట్టుకున్నాడు సింగన్న.

ఎవరికిస్తాడు ఆ పూలు.

ఎదురుగా చిన్న గుళ్ళో కుమారస్వామి విగ్రహం.

నడిచి వెళ్ళలేడు గదా! ముందుకు కూర్చుని దోసిట్లోని పున్నాగల్ని కుమార స్వామి మీదకి విసిరాడు. నల్లటి కుమారస్వామి విగ్రహంపైన తెల్లటి నక్షత్రాల మెరుపులు! *